క్లుప్తంగా

కసాపురంలో ఘనంగా హోమాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం పుష్యార్కం సందర్భంగా పంచసూక్త, మన్యుసూక్త, మూలమంత్ర హోమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక అలంకరణతో కొలువుదీర్చి అర్చకులు పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాలను నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు.

చెరువులను శుభ్రం చేయించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ శుభ్రం చేయించి సాగు, తాగునీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువుల్లో పూడిక తీయించి, ముళ్లకంపలను తొలగించాలన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్, కసాపురం పిల్లకాల్వల ద్వారా చెరువులు, చిన్నచిన్న కుంటలకు నీరు నింపుకుంటే రైతులు పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు సి.రమేష్, జగ్గిలి రమేష్, రంగమ్మ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

9న నిరంజన గురురంగస్వామి ఆరాధన

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురంలో ఈనెల 29న నిరంజన గురురంగస్వామి 89వ ఆరాధన వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి గ్రామోత్సవం నిర్వహించడంతో పాటు అన్నదానం చేస్తామన్నారు. రాత్రికి భక్త చింతామణి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అలాగే ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి రూ.10వేలు, రూ.5 వేలు బహుమతులందజేస్తామన్నారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక



కంటి పరీక్షలకు ఎంపికైనవారితో వైద్యులు

పెద్దపప్పూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ఆర్.వీరారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయ సమావంలో కర్నూలు శాంతిరామ్ కంటి వైద్య నిపుణుడు డా.జగదీష్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కంటి పరీక్షలు చేసి 30మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో షభానా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి



ఏఎస్ఐ గంగాధర్

శింగనమల: శింగనమల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఆయనకు తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టి, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్నపుడు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. భారత్ మాతాకీ జై , వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. కోర్టుల వద్ద జడ్జిలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద తహసీల్దార్లు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఎంపీడీఓలు, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ, గ్రామ సచివాలయాల వద్ద సర్పంచులు, కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల వద్ద ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వేడుకలు నిర్వ హించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే విద్యార్థులకు వ్యాస రచన, క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.





పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ఘనంగా గణతంత్ర దినోత్సవం

- రెపరెపలాడిన ముువ్వన్నెల జెండా
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బీకేఎస్ మండలం జంతులూరు వద్ద ఏపీఎస్పీ బెటాలియన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్



గుంతకల్లులో జెండా వందనం అనంతరం మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మంజుల



యాడికిలో గాంధీ విగ్రహం వద్ద 200 అడుగుల జాతీయ పతాకంతో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్ : భారతదేశ 76వ గణతంత్ర దినోత్సవం గుంతకల్లు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ మైమూన్, కౌన్సిలర్‌లు సుమో బాషా, రంగమ్మ, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు మల్లిఖార్జున శాస్త్రి, తిక్కస్వామి, మోతే మస్తాన్, వీరేష్, బాసిద్, అంజి, పవన్, మౌలా, షాబుద్దీన్, బాబురావు, సూర్యప్రకాష్‌రెడ్డి, మేరీ, సీనియర్ నాయకులు నూర్‌నిజామి, ఖలీల్, ఆర్‌డీజీ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇంజినీర్ లీలాకృష్ణప్రసాద్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవవందనం చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి ఛైర్‌పర్సన్ భవాని, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మయ్య, ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, డీఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లు, కళాశాలలు, పాఠశాలలు, వార్డు సచివాలయాలపై జాతీయ పతాకాలను సంబంధిత అధికారులు ఎగురవేసి గౌరవవందనం చేశారు. భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్ లైబ్రరీ వద్ద ఎంఈఓ మస్తాన్‌రావు, సుబ్బరాయుడు జాతీయపతాకాన్ని ఎగురవేశారు.

» గుంతకల్లులోని జేఎఫ్‌సీఎం కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి మంజుల జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. కోర్టు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఏపీపీ సుహాసిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్, కార్యదర్శి గోపాలక్రిష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు. గుంతకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బీవీ మాధవి త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు

» గుత్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కోర్టుల ఆవరణలో ఏడీజే శ్రీహరి, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు కాశీ విశ్వనాథ్ చారి, శ్వేత, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ మహబూబ్ వలి, సబ్ జైల్లో సూపరింటెంటెంట్ మహేశ్వరుడు, పోలీసు స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ మోహన్ రెడ్డి, ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్ వైజర్ నాగేశ్వరి, ఎస్టీఓ కార్యాలయంలో ఎస్టీఓ సురేష్, జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నాగప్ప, డీజిల్‌షెడ్‌లో ఏడీఎంఈ సుంకన్న, మాజీ సైనిక ఉద్యోగుల కార్యాలయంలో అధ్యక్షుడు జింకా రామూర్తి , కృష్ణయ్య, ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సంఘం అధ్యక్షుడు అబూ బకర్ లు జాతీయ జెండా ఎగురవేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విశాలాక్షి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, తహసీల్దార్ ఓబిలేసు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో డీఈ రెహన వసీం సయదా, ఏఈ అశ్వని కుమారి, కొత్తపేటలో సర్పంచ్ గురుమస్తాన్ జాతీయ జెండా వందనం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేటీఓ మనోహర్ పాల్గొన్నారు.

» శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, వ్యవసాయ కార్యాలయంలో ఎంపీపీ యోగేశ్వరి, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ చితంబరం, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య జాతీయ పతాకం ఎగుర వేశారు.

» యల్లనూరు మండలంలో నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల్లో జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, డిప్యూటీ తహసీల్దారు మునీంద్ర, ఈఓఆర్డీ మనోహర్‌బాబు, వేములపల్లి, తిరుమలాపురం సర్పంచులు అశోక్‌కుమార్‌రెడ్డి , రామాంజులరెడ్డి గ్రంథాలయంలో లైబ్రరియన్ ప్రకాష్‌రెడ్డి తదితరులు జెండా వందనం చేశారు.

»బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ భాస్కర్, ఎంపీపీ సునీత, ఎంపీడీఓ సాల్మాన్, హస్పిటల్‌లో డాక్టర్ లక్ష్మి స్వాతి, అగ్రికల్చర్ కార్యాలయంలో శ్యాం సుంధర్‌రెడ్డి, ఎంఈఓ కార్యాలయంలో నవీద, లింగానాయక్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం నారాయణస్వామి జెండాను ఎగుర వేశారు. అలాగే మండలంలోని రెడ్డిపల్లి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి రెడ్డిపల్లి, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవి, రేకులకుంట పరిశోధనా కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత డాక్టర్ విజయ శంకర్‌బాబు జాతీయ జెండా ఎగుర వేశారు. అలాగే జిల్లా జైలులో సూపరింటెండెంట రహ్మా, రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి జాతీయ జెండా ఎగుర వేశారు. అదేవిధంగా జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ బెటాలియన్‌లో కమాండెంట్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం చేసిన తరువాత జెండా ఎగుర వేశారు. అలాగే పెద్దపప్పూరు, పుట్లూరు, గార్లదిన్నె, పామిడి మండలాల్లో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

రెపరెపలాడిన జాతీయజెండా

తాడిపత్రి పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సాయిప్రసాద్, ఎమ్మార్సీలో ఎంఈఓ నాగరాజు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ శివనారాయణ, భూగర్భగనుల కార్యాలయంలో ఏడీ ఓబులరెడ్డి, ఆస్పత్రిలో సుపరింటెండెంట్ డేవిడ్‌రాజ్ జెండా ఆవిష్కరించారు. అలాగే మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన జెండా వందన కార్యక్రమంలో కమిషనర్ శివరామక్రిష్ణ, చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

» యాడికిలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీర్రాజు, నంబర్ 1 సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, పంచాయతీ ఈఓ అశ్వర్థ నాయుడు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఈరన్న, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ జాఫర్ సాదిక్ , యాడికి, రాయల చెరువు ప్రభుత్వ ఆస్పత్రుల లో వైద్యులు పరమేశ్వర్, అప్పయ్య, దేవరాజన్, ఎమ్మార్సీలో విద్యాధికారి కాశెప్ప జెండా వందనం చేశారు. ఈఓపీఆర్డీ శశికళ, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, రామ్మో హన్, నాగరాజు, గుంతా రామాంజనమ్మ, వెంకటరాముడు పాల్గొన్నారు.

» పెద్దవడుగూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఉషారాణి , ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నరసింహారెడ్డి, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ రాముడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాసబాబు జెండా వందనం కార్యక్రమం నిర్వహించారు.



తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ సాయిప్రసాద్



గుంతకల్లులో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



గుత్తిలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న జడ్జిలు



గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు

గడ్డివాముల దగ్ధం

గుంతకల్లు: పట్టణ శివారులోని నెల్లూరు–అంకోలా జాతీయ రహదారికి సమీపంలోని పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు కందివాముకు నిప్పు పెట్టడంతో పూర్తి దగ్ధమైయిందని రైతు కురబ ధనుంజయ్య వాపోయాడు. దీంతో రూ.4లక్షలు దాకా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు.. పాత గుంతకల్లుకు చెందిన రైతు ధనుంజయ్య కంది పంట కోత కోసి పొలంలోనే వాముగా ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కంది పంట మొత్తం కాలిపోయి బూడిద చూసి బోరుమన్నాడు. దీంతో రూ.4 లక్షల దాకా నష్టపోయినట్లు రైతు వాపోయాడు. పొలం వజ్రకరూరు పోలీసుస్టేషన్ పరిధిలోకి రావడంతో బాధిత రైతు అక్కడ ఫిర్యాదు చేశాడు.

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రైతు బండి లక్ష్మీనారాయణకు చెందిన వేరుశనగ పొట్టు వామి దగ్ధమైంది. వివరాలు.. రైతు మూడెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాడు. పంట తొలగించిన అనంతరం పశువులకు గ్రాసం కోసం పొలంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి గడ్డివాము అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసేలోగా వేరుశనగ పొట్టు మొత్తం బూడిదైంది. రూ.60 వేలు నష్టం వాటిల్లిందని రైతు విలపించాడు. ఆదుకోవాలని బాధిత రైతు లక్ష్మీనారాయణ పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున రైతు సన్న నారాయణ కు చెందిన వరి గడ్డి వాముకు అగ్నికి ఆహుతయింది. సుమారుగా రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధికారులకు 'ఉత్తమ' అవార్డులు



శింగనమల: జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ నుంచి అవార్డు అందుకుంటున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి



పామిడి: నృత్య ప్రదర్శన చేసిన టీసీ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, డీఈఓ

శింగనమల/పెద్దవడుగూరు/పామిడి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఉత్తమ ఉద్యోగులకు ఆదివారం అవార్డులు అందజేసి అభినందించారు. అలాగే అనంతపురంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో టీసీ హైస్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనపై ఆదివారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, డీఈఓ ప్రసాద్‌బాబు ప్రశంసల జల్లు కురిపించారు.



శింగనమల: కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న వెటర్నరీ సహాయ సంచాలకుడు పద్మనాభం



పెద్దవడుగూరు: స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రామరాజు



పెద్దవడుగూరు: లైన్‌మెన్ సుభాన్‌కర్



పెద్దవడుగూరు: జూనియర్ లైన్‌మెన్ హరిగోపాల్



ప్రసాద్, ఆర్టీసీ డ్రైవర్, తాడిపత్రి



ఎస్‌వీఎస్ రెడ్డి, కండెక్టర్, తాడిపత్రి



కృష్ణారెడ్డి, సబార్డినేట్, సీహెచ్‌సీ, పామిడి

కార్మిక చట్టాల వ్యతిరేక విధానాలు వీడాలి



మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

పామిడి: కేంద్రంలో పీఎం మోదీ సర్కారు అవలంభిస్తున్న వ్యవసాయ, మార్కెట్, కార్మిక చట్టాల వ్యతిరేక విధానాలు వీడాలని సీపీఎం అనుబంధ రైతుసంఘం నాయకులు, సీనియర్ నాయకులు పీ అనిమిరెడ్డి, ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి హితవు పలికారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, మార్కెట్, కార్మిక చట్టాలు కార్పొరేటర్లకు కొమ్ము కాస్తున్నాయన్నారు. తద్వారా వ్యవసాయ, మార్కెట్, కార్మిక చట్టాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. కేంద్రం తక్షణం ఆ వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికాలన్నారు. అంతకుముందు వారు బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లేసు, ఆర్ ముత్యాలు, పీట్ల శివకుమార్, దూద, చోటు, బాబా ఫకృద్దీన్, నాగరాజు, జిలాన్‌బాషా, షాషు, రామాంజనేయులు, మాబు తదితరులు పాల్గొన్నారు.

'చదువుకన్నా సంస్కారం ముఖ్యం'

తాడిపత్రి అర్బన్: పిల్లలకు చదువుకన్నా...సంస్కారమే ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ జేసీ.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీవాణి విద్యానికేతన్‌లో నిర్వహించిన ఘంటసాల సంగీవ విభావరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయకులు పాడిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ గంగాధర్, డైరెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణుడికి పూజలు

పెద్దపప్పూరు: మండలంలో అశ్వత్థనారాయణ స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు సుదీర్‌కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్‌కుమార్ శర్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. వచ్చే ఆదివారం తిరుణాల ప్రారంభం అవుతున్న సందర్భంగా ముందస్తుగా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు

గుంతకల్లు: విష్ణు సహస్రనామాలు పఠించడం మండలం రోజు పూర్తయిన సందర్భంగా స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహావిష్ణువు, లక్ష్మీదేవికి అభిషేకం గావించి వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరు కృపాకర్, కోశాధికారి మేడ వెంకటేశ్వర్లు, నాయకులు పరుచూరి సత్యరంగయ్య, జయం వెంకట్, ఇల్లూరి సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

చిన్నారులకు స్కేటింగ్ పోటీలు

గుత్తి: గుత్తిలో ఆదివారం స్కేటింగ్ అకాడమీ మాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. గుత్తి కోర్టు వద్ద ఏడీజే శ్రీహరి పచ్చ జెండా ఊపి స్కేటింగ్ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చిన్నారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.



స్కేటింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఏడీజే శ్రీహరి

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన డ్రైవర్ సహదేవన్

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు లోడుతో లారీ వెళ్తోంది. కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అనంతపురం వైపు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో వెనుక లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బ తిని సేలానికి చెందిన డ్రైవర్ సహదేవన్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ముందున్న లారీ రోడ్డు డివైడర్ పైకి ఎక్కి నిలబడింది. రోడ్డుపై లారీలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో నుంచి డ్రైవర్ సహదేవన్‌ను బయటకు తీసి లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. గాయపడిన డ్రైవర్‌ను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.